

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - కడప అర్బన్

రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం డాక్టర్ వైఎస్ఆర్ ఏరియా హాస్పిటల్‌లో ఎపిఎస్ఆర్‌టిసి, రిమ్స్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా ప్రజా రవాణా అధికారి గోపాల్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాకు చెందిన వివిధ డిపోల నుంచి 54 మంది ఉద్యోగులు రక్తదాన చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఎంఇ భాస్కర్, ఎటిఎం హరి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, రిమ్స్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ రాజేంద్ర, విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ రెహమాన్, ఆర్‌టిసి హాస్పిటల్, ఇతర డాక్టర్లు, వివిధ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

నష్టాల 'శని'గ



శనగను యంత్రంతో ఆడిస్తున్న కూలీలు

నియోజకవర్గంలో 42 వేల ఎకరాల్లో సాగైన పప్పుశనగ

వెంటాడిన తుపాన్లు

ఎకరాకు ఐదు క్వింటాళ్లలోపే..

పూత దశలో ముంచిన పొగమంచు

వేధిస్తున్న గిట్టుబాటు ధర

పెరిగిన పెట్టుబడులు.. భారీగా తగ్గిన దిగుబడులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కోటి ఆశలతో రబీ సీజన్‌లో మొదటి పంటగా సాగు చేసిన పప్పుశనగ రైతులకు కలిసి రాలేదు. సాగు ఆరంభం నుంచి వారికి వరుస కష్టాలు వెంటాడాయి. విత్తనానికి ముందు వర్షాభావం, పైరు వివిధ దశల్లో తెగుళ్ల, పంట చేతికందే తరుణంలో తుపాన్లు, పొగమంచు చుట్టుముట్టి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. నియోజకవర్గంలో దాదాపు 42 వేల ఎకరాలలో బుడ్డ శనగ సాగు చేశారు. అత్యధికంగా సింహాద్రిపురం మండలంలో సుమారు 16 వేల ఎకరాలలో, లింగాలలో పదివేల ఎకరాలలో, తొండూరులో 5 వేల ఎకరాలలో, పులివెందులలో 2 వేల ఎకరాలలో, వేముల 4 వేల ఎకరాలలో, వేంపల్లిలో 3 వేల ఎకరాలలో, చక్రాయపేటలో 2 వేల ఎకరాలలో సాగు చేశారు. మూడు నెలల పంటకాలం కలిగిన ఈ పైరు ప్రస్తుతం చేతికందటంతో రైతులు కోత, నూర్పిడి పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది సాగు చేసిన శనగలో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయనుకుంటే ఎకరాకు 5 క్వింటాళ్ల లోపు దిగుబడులు వస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తుపాన్లు, తెగుళ్ల ఒక వైపు వెంటాడగా పైరు పూత, తట్ట దశలో వారం, పది రోజులపాటు పొగమంచు కుర వడం వల్ల దిగుబడులపై ప్రభావం పడింది. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడికి తోడు కోత, నూర్పిడికి ఎకరాకు రూ. 2 వేల నుంచి రూ.2,500 అదనంగా వెచ్చించాల్సి రావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనానికి ముందు ఎర్ర శనగలు క్వింటా రూ.7,500, తెల్లశనగలు రూ.10 వేలు ధర పలికాయి. ప్రస్తుత మార్కెట్లో ఎర్రశనగ క్వింటా రూ.5500, తెల్లశనగ క్వింటా రూ.7000 మాత్రమే ధర పలుకుతుండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఈ ధరకు విక్రయిస్తే కనీసం పెట్టుబడులు కూడా రావని వాపోతున్నారు. శనగకు మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలని, లేకపోతే ఆత్మహత్యలే శరణ్యమని చెబుతున్నారు

పెరిగిన పెట్టుబడులు.. తగ్గిన దిగుబడులు

గతేడాది అక్టోబర్ మొదటి వారం నుంచి శనగ సాగుకు అదును కాగా విత్తన సమయంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. వరణుడిపై భారం వేసి జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో రైతులు విస్తారంగా శనగ పంట సాగు చేశారు. విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపునివారణ, తదితర పెట్టుబడుల రూపంలో ఎక రాకు రూ.20 వేలు వెచ్చించారు. కౌలు రైతులపై కౌలు రూపంలో అదనంగా మరో రూ.15 వేలు భారం పడింది. పంట మార్పిడి విధానం అవలంభించకపోవడం, విత్తన సమయంలో పొలాలను కలియదున్నక పోవడం, మోతాదును మించి రసాయన ఎరువులు వాడటం, వాతావరణం అనుకూలించ కపోవడం, తదితర కారణాలతో శనగ పైరును వేరుకుళ్ళ (ఎండు తెగులు) ఆశించి పైరులో మొక్కలు ఎండిపోయాయి. పూలేజి (తెల్లశనగ) రకానికి చెందిన పైరుకు ఎక్కువశాతం ఎండు తెగులు సోకింది. దీనికితోడు గత నవంబర్, డిసెంబర్ నెలల్లో తుపాన్ల ప్రభావంతో కురిసిన వర్షాలు, అధిక తేమ కారణంగా పైరు దెబ్బతినింది. దీంతో రైతులు నష్టాలు మూటగట్టుకోవాల్సి వచ్చింది.

దిగుబడులు అంతంత మాత్రమే

ఈ ఏడాది సొంత పొలంతో పాటు ఎకరాకు రూ. 18 వేలు కౌలు చెల్లించి మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని 17 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశాను. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 20 వేలు వెచ్చించాను. తుపాన్లు, తెగుళ్ల ప్రభావంతో దిగుబడులు అంతంత మాత్రంగానే వస్తున్నాయి. ఎకరాకు 5 క్వింటాళ్లకు మించి రావడం లేదు.

- రామిరెడ్డి, రైతు, లింగాల మండలం.

గిట్టుబాటు ధర కల్పించాలి

ఈ ఏడాది రబీసీజన్ సాగు పప్పుశనగకు మార్కెట్లో గిట్టుబాటు ధర లేదు. సొంత పొలంతో పాటు మరో ఐదు ఎక రాలు కౌలుకు తీసుకుని శనగ, సాగు చేశాను. ప్రస్తుతం పైరులో కోత, నూర్పిడి పనులు జరుగుతున్నాయి. వాతావరణం అనుకూలించక దిగుబడులు తగ్గాయి. ప్రస్తుత మార్కెట్లో శనగకు మద్దతు ధర లేదు. ప్రభుత్వం క్వింటాకు రూ.8 వేలు, విక్రయించి ఆదుకోవాలి.

- జనార్దన్ రెడ్డి, రైతు, పులివెందుల.



శనగను కోస్తున్న కూలీలు



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ

జాతీయ స్థాయిలో పీజీ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - కడప

గత డిసెంబర్‌లో ఆగ్రాలో జాతీయస్థాయిలో జరిగిన శస్త్ర చికిత్స అవగాహన సదస్సులో కడప రిమ్స్ జనరల్ సర్జరీ విభాగంలో మూడవ సంవత్సరం చదువుతున్న పీజీ విద్యార్థిని డాక్టర్ యు. హర్షిణి ఉత్తమ ప్రతిభ కనబరచి మొదటి బహుమతిని కైవసం చేసుకున్నారు. ఆమెను బుధవారం శస్త్ర చికిత్స విభాగాధిపతి డాక్టర్ రాణి, ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ అభినందించారు. **6 కిలోల కణితి తొలగింపు...** కడప రిమ్స్‌లో బుధవారం అరుదైన శస్త్ర చికిత్స జరిగింది. రాయచోటికి చెందిన యువకుడు యునెస్ కడుపు ఉబ్బరం, నొప్పితో బాధపడుతూ కడప రిమ్స్ శస్త్ర చికిత్స ఓపికి వచ్చాడు. డాక్టర్లు పరిశీలించి కడుపు లోపల పెద్ద కణితి ఉందని నిర్ధారించారు. శస్త్ర చికిత్స విభాగాధిపతి డాక్టర్ వాణి ఆధ్వర్యంలో వైద్య బృందం రెండు గంటలపాటు శ్రమించి 6 కిలోల కణితిని తొలగించారు. ఈ అరుదైన ఆపరేషన్ చేసినందుకు శస్త్ర చికిత్స విభాగాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ అభినందించారు.

కార్పొరేషన్‌లో అవినీతి కంపు : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరపాలక సంస్థ 20 ఏళ్లపాటు పాటు అవినీతి కంపులో కూరుకుపోయిందని, ఆ ఇద్దరి వల్ల అభివృద్ధి కుంటు పడిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ద్వారకా నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతిని వెలికి తీసి అభివృద్ధి పరుగులు పెట్టిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మాధవి కార్పొరేషన్ అభివృద్ధి చేస్తుంటే కక్ష సాధింపు అంటూ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసుకుంటూ వెళుతున్నామని పేర్కొ న్నారు. వైసిపి అవినీతితో సర్వనాశనం చేశారని విమర్శించారు. వీరి అవినీతిని ప్రజల ముందు పెడతామని చెప్పారు. 90 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తే, 10 శాతం మంది గగ్గోలు పెడుతూ కక్ష సాధింపు అంటున్నారని పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పేరుతో రెండు రూపాయలకే మంచినీరు ప్రజలకు అందించాలని పథకం తీసుకొచ్చారని తెలిపారు. వైసిపి వచ్చాక మంచినీటిని వ్యాపారం చేశారని చెప్పారు. కార్పొ రేషన్ ఆస్తులు కాపాడాలని ఎమ్మెల్యే ఆర్‌టిసి సమావేశంలో కోరారని గుర్తు చేశారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షులు మన్సూర్ అలీ ఖాన్, టిఎన్ ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు తిరుమలేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

శ్రీకృష్ణదేవరాయ కూడలిని సుందరీకరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

దక్షిణ భారతదేశ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు జయంతి సందర్భంగా ఈ నెల16న కృష్ణదేవరాయ కూడలిలో విగ్రహాన్ని సుందరీకరించాలని, క్రేన్ సౌకర్యం కల్పించాలని శ్రీకృష్ణదేవరాయ బలిజ అభ్యుదయ సేవా సమితి, సంస్థ జిల్లా అధ్యక్షులు దాసరి శివప్రసాద్, తోటకృష్ణ కోరారు. బుధవారం కార్పొరేటర్లు మల్లికార్జునరెడ్డి, ప్రసాద్, షఫీతో కలిసి మేయర్ సురేష్ బాబు, కమిషనర్ మనోజ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వైసిపి ప్రభుత్వం నగర సుందరీకరణలో భాగంగా శ్రీ కృష్ణ దేవరాయ కూడలిలో ఉన్న పాత విగ్రహాన్ని తొలగించి కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. నూతనవిగ్రహాన్ని అయితే ఏర్పాటు చేశారని, నిచ్చెనను మళ్లీ ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవ రాయలు జయంతి సందర్భంగా పూల ధారణకు కావలసిన క్రేన్ ఏర్పాటు చేయాలని విగ్రహం చుట్టూ పూలతో అలంకరించాలని కోరారు. ఆదివారం ఉదయం 9 గంటలకు క్రేన్ కానీ, తాత్కాలిక నిచ్చెనను కానీ ఏర్పాటు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న తోటకృష్ణ

డార్విన్ సిద్ధాంతాన్ని తిరిగి పాఠ్యాంశాల్లో చేర్చాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులపై సిలబస్ భారాన్ని తగ్గించే పేరిట 9,10 తరగతులలోని డార్విన్ జీవ పరిణామ క్రమ సిద్ధాంతాన్ని తొలగించడం అత్యంత దురదృష్టకరమని, డార్విన్ సిద్ధాంతాన్ని మళ్లీ పాఠ్యాంశాలలో కొనసాగించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం సిద్ధవటం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 11వ బెటాలియన్‌లో జన విజ్ఞాన వేదిక రూపొందించిన డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సమీర్ బాష మాట్లాడుతూ డార్విన్ సిద్ధాంతం జీవుల పరిణామం, నూతన జీవుల ఆవిర్భావం, జన్యు శాస్త్రం మొదలైన వాటికి ఆయువు పట్టు అని తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయులు రవిశంకర్ మాట్లాడుతూ డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం జీవుల నిర్మాణంలో, ప్రవర్తనలో, జన్యువుల్లో కాలక్రమేణ సంభవించే మార్పులను వివరించే శాస్త్రీయ సిద్ధాంతమని పేర్కొన్నారు. ఇటువంటి ముఖ్యమైన అంశాలను తప్పకుండా మళ్లీ పాఠ్యాంశాలలో చేర్చాలని, దానివల్ల విద్యార్థులకు ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజమ్మ, పరమేశ్వరి, ఒకేషనల్ టీచర్స్ మౌలాలి, హేమంత్, విద్యార్థులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

'అన్నదాత సుఖీభవ'ను అమలు చేయండి

కలెక్టరేట్ ఎదుట నిరసనలో రైతు సంఘాల నాయకులు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు పెట్టుబడి సహాయం రూ.20 వేల ఇవ్వాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట రైతు సేవా సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎం.వి. రమణ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి, రైతు స్వరాజ వేదిక జిల్లా కన్వీనర్ శివారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతుల ఖాతాలలో జమ చేయాలని తెలిపారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. రాయలసీమ నడిబొడ్డులో కృష్ణా నది ప్రవహిస్తుందని నీటి యాజమాన్య బోర్డ్ కర్నూల్‌లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ పట్ల పాలకుల నిర్లక్ష్య వైఖరి విడనాడాలని తెలిపారు. దశాబ్దాల తరబడి రాయలసీమలో రాజోలి జలాశయం, గుండ్రేవుల జోలదరాశి, గాలేరు నగరి, తెలుగు గంగ లాంటి ప్రాజెక్టులు బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించడంతో పెండింగ్ ప్రాజెక్టులు నత్తనడకన నడుస్తున్నాయని పేర్కొన్నారు. యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టు పూర్తి చేసి కరువు రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. తహశీల్దార్ కార్యాలయంలో రైతులకు వన్ బి, అడంగల్, పాస్బుక్ ఆన్‌లైన్ కోసం అధికారులు జలగల్లా పీడిస్తున్నారని చెప్పారు. తక్షణమే తహశీల్దార్ కార్యాలయంలో అవినీతిని అరికట్టాలని తెలిపారు. భూ యజమానుల సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు దారులకు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లాలో రైతాంగ సమస్యల పరిష్కరించాలని, కృత్రిమ ఎరువుల కొరత సృష్టిస్తున్నారని, యూరియా, డిఎపి ఎరువులు రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచాలని కోరారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పంట కాలువలు పూర్తి చేయాలని చెప్పారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. నిరసన అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సేవా సమితి జిల్లా కార్యదర్శి మస్తాన్ రావు, రైతు సంఘం నాయకులు నాగరాజు, సంజీవ రాయుడు, రామ్మోహన్, మురళి, షామీర్ బాష పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

మహాశివరాత్రి పర్వదిన మహోత్సవాల ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించి ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రముఖ శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లపై ఎస్‌పి అశోక్ కుమార్, డిఆర్ఒ విశ్వేశ్వరనాయుడు, ఎఎస్‌పి ప్రకాష్‌బాబు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్‌లతో కలిస దేవాదాయ శాఖ, రెవెన్యూ, పోలీసు అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా పెండ్లిమర్రి మండలంలోని పొలతల శ్రీ మల్లీశ్వర స్వామి దేవస్థానం, సిద్దవటం మండలంలో శ్రీ నిత్యపూజ స్వామి దేవస్థానం, చాపాడు మండలం అల్లాడిపల్లిలోని శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం, బద్వేలు మండలం లంకమల్ల గ్రామంలోని శ్రీ లంకమల్లేశ్వర స్వామి ఆలయంలోని శ్రీ గుండాల ఈశ్వర స్వామి దేవాలయం, మైలవరం మండలంల శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవాలయం తదితర 13 శైవక్షేత్రాల్లో లక్షలాది సంఖ్యలో భక్తులు హాజరవుతారని పేర్కొన్నారు. వారందరికీ ఎలాంటి లోటుపాట్లు, ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి శైవ క్షేత్రాల్లో ముఖ్యంగా ఆయా ప్రాంతాల్లో శానిటేషన్ పనులు సంబంధిత అధికారులతో సమన్వయమై పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆలయాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎక్కడైతే భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందో ఆ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాలను అధికంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అన్ని ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, 108 అంబులెన్స్‌కు, అందుబాటులో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం ఎస్‌పి అశోక్ కుమార్ మాట్లాడుతూ మహా శివరాత్రి పండుగ సందర్భంగా అన్ని శైవక్షేత్రాలలో పోలీసు బందోబస్తు ఉండేవిధంగా చర్యలు తీసుకుంటామని, అవసరమైన చోట అధిక పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, ఎఎస్‌పి ప్రకాష్ బాబు, కడప నగర కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప, జమ్మలమడుగు ఆర్‌డిఒలుజాన్ ఇర్విన్,సాయిశ్రీ, ఆయా దేవాలయాల ఇఒలు, చైర్మన్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన ఆరోగ్య సంరక్షణ

ప్రజాశక్తి - కడప అర్బన్

రామయ్యయూనివర్సిటీ బెంగళూరు సౌజన్యంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో గ్రామీణ యువతకు ఆరోగ్య అవగాహనపై ప్రత్యేక సదస్సు నిహార్ హెల్త్ ఫౌం డేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆరోగ్య నిపుణుడు డాక్టర్ సయ్యద్ మహమూద్ బాష మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ ప్రతి ఒక్కరి హక్కు అని, గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ఇప్పటికీ ఒక సవాలుగా ఉందని తెలిపారు. తగిన అవగాహన లేకపోవడం, వైద్య వసతుల కొరత, ఆర్థిక పరిమితుల కారణంగా చాలా మంది సరైన సమయంలో వైద్యం పొందలేకపోతున్నారని చెప్పారు. గ్రామీణులకు ఆరోగ్యంపై మరింత అవగాహన కల్పించడం ద్వారా నివారించదగిన వ్యాధులను వివరించారు. స్థానిక యువతకు ఆరోగ్య కార్యకర్తలుగా శిక్షణ ఇస్తే, వారు గ్రామస్తులకు ప్రాథమిక వైద్య సేవలు అందించే వీలవుతుందని పేర్కొన్నారు. టీకాలు, ఆరోగ్య తనిఖీలు, జీవన వ్యాధుల నివారణపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలి పరిశుభ్రత, తాగునీటి ప్రాముఖ్యత, మలేరియా, డెంగీ వంటి వ్యాధుల నివారణపై ప్రచారం చేయాలని తెలిపారు. గర్భిణులకు ప్రసవపూర్వ సంరక్షణ, టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిం చారు. గ్రామీణులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా తీసుకో వాల్సిన చర్యలను వివరించారు. సమగ్ర వైద్య సదుపాయాలు, అవగాహన కార్యక్రమాలు, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో గ్రామీణ ఆరోగ్య సంర క్షణను మరింత మెరుగుపరచగలమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నిహార్ హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మహమూద్‌బాష

విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి - గోపవరం

సొంత పొలం కల్గిన ప్రతి రైతూ విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎఒ కల్లూరు చంద్ర పేర్కొన్నారు. బుధవారం బద్వేలు మండలంలోని కొంగలవీడు రైతు సేవా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రైతులు వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే అన్ని పథకాలను పొందాలి అంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఇకెవైసి చేసుకొని లబ్ధి పొందాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే ప్రతి పథకమూ లబ్ధి పొందాలంటే రిజిస్ట్రేషన్ చేయించుకొని విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని వివరించారు. సొంత భూమి కలిగిన ప్రతి రైతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుకు ఎన్ని గ్రామాల్లో పొలాలున్నా ఎక్కడో ఒక చోట మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకుంటే సరిపోతుంది అన్నారు. అలాగే చీడ పీడలను పైన రైతులకు సూచనలు, సలహాలిచ్చారు.



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఎఒ కల్లూరు చంద్ర



నిరసనలో నినాదాలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్క రించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కోశాధికారి గోపి, నగర అధ్యక్షులు సుంకర రవి డిమాండ్ చేశారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆప్కాస్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని వైసిపి ప్రభుత్వం నుంచి పోరాటం చేస్తున్నామని తెలిపారు. 9 మంది ఐఎఎస్‌లతో వేసిన కమిటీ ఆధారంగా వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని అడిగినా పట్టించు కోవడం లేదని పేర్కొన్నారు. గత్యంతరం లేక రోడ్డు ఎక్కాల్సి వచ్చుందన్నారు. 16 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఆర్థిక శాఖలో పెండింగ్ ఉన్న జీవోలను విడుదల చేయాలన్నారు. 13 వేల మంది ఇంజినీరింగ్ కార్మికులకు రూ.15000 వేల వేతనం ఇస్తున్నారని పేర్కొన్నారు. దాంట్లో పిఎఫ్, ఇఎస్ఐ కటింగ్ పోను రూ.13087 వస్తుందని తెలిపారు. ఈ వేతనంతో కుటుంబం బతకడం చాలా కష్టమవుందని చెప్పారు. జివో 36 ప్రకారం రూ .24,500 ఇవ్వాలని, లేని పక్షం అతి త్వరలో సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ జిల్లా సహాయ కార్యదర్శులు ఆనంద్ రావు, బ్రహ్మానంద రెడ్డి, మున్సిపల్ నగర అధ్యక్షులు సుంకర రవి, డ్రైవర్స్ నాయకులు సుంకర కిరణ్, పర్మినెంట్ నాయకులు కొండయ్య,మస్తాన్, మహిళా నాయకులు ధరణి, సిద్దయ్య, శ్యాం, సుబ్బయ్య, రామసుబ్బారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, నారాయణ, బుజ్జి బాబు, లక్ష్మయ్య, గోవర్ధన్, మురళి కృష్ణ, హనుమంత్ రెడ్డి, ప్రసన్న కుమార్, రమేష్, పాలకొండరాయుడు, గోపాల్, శ్రీను, ప్రవీణ్, ప్రశాంత్, ప్రదీప్ కుమార్, రాంబాబు, రాజేష్, జగదీష్, కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

బుధవారం ఉదయం 9 గంటల - 10.30 గంటల మధ్య ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో మాఘ పౌర్ణమి సీతారామాల కల్యాణోత్సవాన్ని ఘనంగా టిటిడి అధికారులు నిర్వహించారు. శాస్త్రోయుక్తంగా పండితులు వేదమంత్రాలతో స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు బంగారు ఆభరణాలను ధరింపజేసి అత్యంత వైభవంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం తలంబ్రాలు కార్యక్రమం నిర్వహించి కోలాటంతో కనువిందు చేశారు. కల్యాణానికి ఉబయదారులు పట్టు వస్త్రాలుఅందజేశారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారు స్వామివారి కల్యాణం చూసి తన్మయత్వం చెందారు. కార్యక్రమాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్, టిటిడి అధికారులు సెక్యూరిటీ సిబ్బంది విజయవంతంగా నిర్వహించారు.



మాఘ పౌర్ణమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



ప్రీ ఫైనల్ పరీక్షలను పరిశీలిస్తున్న డిఇఒ షంషుద్దీన్

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని డిఇఒ షంషుద్దీన్ సూచించారు. ఖాజీపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, నర్సరాజు పేటలోని ఉర్దూ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పదవ తరగతి ప్రీ ఫైనల్ పరీక్షల తీరును పరిశీలించారు. అనంతరం డిఇఒ ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేటుకు దీటుగా వంద శాతం ఉత్తీర్ణత ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ నాగ సర్వర్ పాల్గొన్నారు.

ముద్దనూరు : మార్చిలో జరగనున్న పది పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించాలని ప్రొద్దుటూరు డిప్యూటీ డిఇఒ మీనాక్షి ఆకాంక్షించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం మీనాక్షి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల పాఠ్య ప్రమాణాలను, విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ ఏడాది కూడా మంచి ఫలితాలను సాధించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొన్నారు.



అంగరంగ వైభవం.. శ్రీవెంకటేశ్వర స్వామి రథోత్సవం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందల పాత బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీపద్మావతి కల్యాణ వెంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి, రథంలో స్వామివారిని కొలువుదీర్చారు. ముందుగా ఆలయ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. రథాన్ని భక్తులు లాగుతూ పుర వీధుల గుండా తీసుకువెళ్లారు. రథం ముంగిట కోలాట ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. అర్బన్ సిఐ నరసింహులు, రూరల్ సిఐ వెంకటరమణ, ఎస్ఐలు నారాయణ, విష్ణువర్ధన్ తమ సిబ్బందితో పర్యవేక్షించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కొమెర పెద్ద కుల్లాయప్ప 9వ వర్ధంతి సందర్భంగా పట్టణ పరిధిలోని చిన్న రంగాపురం సమీపంలో ఉన్న లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో ఆయన భార్య వెంకటలక్ష్మమ్మ, కుమారులు వెంకట కుళ్లాయప్ప, హరినాథ్ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులకు అన్నదానం చేయడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. కార్యక్రమంలో కోడళ్లు శిరీష, లక్ష్మీదేవి మనమరాలు, మనమళ్లు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గంతో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు

మాల మహానాడు నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు మాల మహానాడు జి.చెన్నయ్య గ్రూపు ఎన్‌జిఒ హోంలో మండల, జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించింది. కడప జిల్లా అధ్యక్షులు జేష్ఠది భాస్కర్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షుడిగా జె మధుబాబు, పట్టణ అధ్యక్షునిగా జె పవన్, పట్టణ మహిళా అధ్యక్షురాలుగా సింహం శాంతమ్మ, పట్టణ గౌరవ అధ్యక్షులుగా దియా సుధాకర్, పట్టణ యూత్ ప్రెసిడెంట్‌గా జె స్వరూప్, పట్టణ గౌరవ ఉపాధ్యక్షునిగా జె సన్నా, కడప జిల్లా జనరల్ సెక్రెటరీగా ఎర్రమాసు సునీల్, జిల్లా జాయింట్ సెక్రెటరీగా జి చంద్రశేఖర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. నియామకాలు అందుకున్న వారు మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు జి చెన్నయ్య, జాతీయ మహిళా అధ్యక్షురాలు మంచా నాగ మల్లేశ్వరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీపతి భాస్కర్, కొత్త మాస్ రాబర్ట్, విజయ్, పి ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

రైతులు ఆర్థికంగా బలోపేతం కావడమే లక్ష్యం

ప్రజాశక్తి - వేంపల్లె : వ్యవసాయంతో పాటు పశుసంపద, పాల ఉత్పత్తులు పెంచే దిశగా రైతులను ప్రోత్సాహించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ముసలరెడ్డిగారి పల్లెలో నిర్మించిన మినీ గోకులం షెడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం బీటెక్ రవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిని ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. ఉపాధి హామీ పథకం కింద గోకులం షెడ్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. విడతలవారీగా అర్హులైన వారందరికీ గోకులం షెడ్లను అధికారులు మంజూరు చేస్తారన్నారు. గోకులం షెడ్లను నిర్మించుకున్న రైతులకు బిల్లులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో ఉపాధి పథకం కింద గోకులం షెడ్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కుళాయమ్మ, జిల్లా కార్యదర్శి ఎస్వీ జయరామిరెడ్డి, టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

వివేకా కేసులో సునీతది రాజీలేని పోరాటం : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వైఎస్ సునీత రాజీలేని పోరాటం చేస్తోందని బీటెక్ రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. వివేక హత్య కేసులో న్యాయం గెలుస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. వివేకా కేసు నిందితులకు బెయిల్ రద్దు అవుతుందని అనుకుంటున్నానని చెప్పారు. వైసిపి ప్రభుత్వ పాలనలో అధికారులను తప్పుదోవ పట్టించి బెయిల్ పొందిన వివేకా హత్య కేసు నిందితులకు బెయిల్ రద్దు చేయాలని సుప్రీం కోర్టులో సునీత పిటిషన్ వేశారన్నారు. రెండు రోజుల క్రితం దస్తగిరిని సాక్షిగా తీసుకోవడం తప్పని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కూడా పిటిషన్ వేశారని తెలిపారు. ఈ కేసులో సునీత విజయం సాధిస్తుందని బీటెక్ రవి ఆశాభావం వ్యక్తం చేశారు.

జెఇఇ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జెఇఇ మెయిన్స్ ఫస్ట్ సెషన్ ఫలితాల్లో స్థానిక శ్రీసాయి చైతన్య జూనియర్ కాలేజీ విజయకేతనం ఎగురవేసిందని కరస్పాండెంట్ నారాయణరెడ్డి తెలిపారు. ఎస్.హర్షద్ అలీ అనే విద్యార్థి 90.38 శాతంతో పులివెందులలో టౌన్ టాపర్‌గా నిలిచాడని ప్రిన్సిపల్ గంగిరెడ్డి లక్ష్మీనారాయణ, మహేంద్ర అధ్యాపకులు అభినందించారు. కళాశాల డైరెక్టర్ ఎ.నీరజ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇంకా మెరుగైన ఫలితాలను ఐఐటి, జెఇఇ మెయిన్స్, నీట్‌లో సాధించడానికి విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నామన్నారు.

దువ్వూరు : గుడిపాడు గ్రామానికి చెందిన వరికూటి వెంకట శ్రీశాంత్‌రెడ్డి అనే విద్యార్థి జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో 99.27 మార్కులతో ఉత్తమ స్థానాన్ని పొంది జెఇఇ అడ్వాన్స్ పరీక్షలకు అర్హత సాధించాడు. గ్రామీణ ప్రాంత రైతు కుటుంబానికి చెందిన ఈ విద్యార్థి గతంలో 10వ తరగతిలో 586 మార్కులు సాధించడమే కాకుండా పాలిటెక్నిక్‌లో జిల్లా ఫస్ట్ ర్యాంకు కూడా సాధించాడు. మంచి ర్యాంకు సాధించడం పట్ల విద్యార్థి తండ్రి వెంకటరమణారెడ్డి, తల్లి హర్షం వ్యక్తం చేశారు.

ఖాజీపేట : మంగళవారం విడుదలైన జెఇఇ ప్రథమ పరీక్ష ఫలితాల్లో బీరం పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి బుధవారం హర్షం వ్యక్తం చేస్తూ.. 119 మంది విద్యార్థుల్లో 82 మందికిపైగా జెఇఇ మెయిన్స్ ద్వారా అర్హత సాధించారన్నారు. బీరం శ్రీధర్‌రెడ్డి జూనియర్ కళాశాల ఏర్పాటు నుంచి ప్రతి ఏడాది అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నామన్నారు. ఇప్పటివరకు తమ సంస్థ 20 మందికిపైగా ఐఐటీలో, 30 మందికి పైగా ఎన్ఐటీలో, 30 మందికిపైగా ఐఐఐటీలో ప్రవేశాలు పొందారన్నారు. చైర్ పర్సన్ సరస్వతమ్మ మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన విజయాలు తమ కళాశాలకు ఖ్యాతిని పెంచాయని, ఇందుకు అధ్యాపకుల కృషి ఎంతో ఉందన్నారు. డైరెక్టర్ స్వాతి అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ఉప ప్రధానో పాధ్యాయుడు మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఖాజీపేట

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సుగుణ పేర్కొన్నారు. మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో బుధవారం సైబర్ నేరాల గురించి పొదుపు మహిళలు, ప్రజలకు అవగాహన కల్పించారు. రిజర్వు బ్యాంకు వారి సౌజన్యంతో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలు, సైబర్ నేరాల గురించి డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఫోన్‌లో వ్యక్తిగత సమాచారాలు, ఒటిపిలు షేర్ చేయవద్దని సూచించారు. కెనరా బ్యాంక్ విశ్రాంత సీనియర్ మేనేజర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ లావాదేవీలు, పొదుపు నిర్వహణ, డిజిటల్ లావాదేవీలకు సంబంధించి వచ్చే లింక్స్ పట్ల జాగ్రత్త వహించాలన్నారు. కెనరా బ్యాంకు ఎఫ్ఎల్‌సిసి వీరప్రసాద్, కో-ఆర్డినేటర్ ఉదయ్ కుమార్ పలు సూచనలు చేశారు. హెర్డ్స్ సంస్థ అధ్యక్షులు కృష్ణయ్య యాదవ్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేసేందుకు తమ సంస్థ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కెవిఎస్ రూరల్ మీడియా కళాజాత బృంద ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ ప్రదర్శన ప్రారంభించినట్లు జిల్లా మార్కెటింగ్ ఎన్ఎఫ్ఎ శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఎంటి ప్రతాప్‌రెడ్డి సహకారంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పరిసరాల ప్రాంతాల్లో పండించిన ఉత్పత్తులను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ ప్రతిరోజు ఆసుపత్రికి వచ్చే రోగులు ఆరోగ్యం, తీసుకొనే ఆహారంపై గర్భిణులు, రోగులకు వివరించారు. అనారోగ్యానికి కారణం కల్తీ ఆహారమే కారణమన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, పండ్లను తీసుకోవాలన్నారు. సూచించారు. ఎఒ రాజేం ద్రప్రసాద్, ఎఇఒ, ఎంటిఒలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో యూనియన్ సమస్యలు పరిష్కారం

- రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్‌బాబు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఐకమత్యంతో యూనియన్ సమస్యలను పరిష్కరిష్కరించుకుందామని రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్‌బాబు అన్నారు. స్థానిక విద్యుత్ డివిజనల్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఎపిఇఇయు 1104 యూనియన్ 75 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో పులివెందుల డివిజన్ అధ్యక్షుడు పుల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ సలీం, డివిజన్ సెక్రెటరీ సుదర్శన్, అడిషనల్ సెక్రటరీ వేణు గోపాల్, డివిజనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ హేమచంద్ర, ట్రెజరర్ వెంకటరత్నం, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో అన్నదానం..

ప్రొద్దుటూరు : అన్నం పరబ్రహ్మ స్వరూపంగా భావించి ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎపిఇఇయు1104 యూనియన్ ఆవిర్భావ సందర్భంగా ప్రొద్దుటూరు సంఘ సభ్యులు అన్నదానం చేశారు. సభ్యుల ఆహ్వానం మేరకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. యాచకులకు, నిస్సహాయకులకు సాధువులకు, వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

సాగులో తగు సూచనలు పాటించాలి

ప్రజాశక్తి-చాపాడు

మండల పరిధిలోని ఎన్.ఓబాయపల్లె, అయ్యవారిపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వ్యవసాయాధికారి మ్యాగీ మాట్లాడుతూ తప్పక విశిష్ట సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేయిం చుకోవాలని సూచిం చారు. ఈ ప్రక్రియ ద్వారా రైతుకు ఒక ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తారన్నారు. తద్వారా ప్రభుత్వ పథకాలు, రాయితీలు, ఇతర వ్యవసాయ సంబధ సేవలను పొందడానికి దోహద పడుతుందన్నారు. సాగులో ఉన్న వరి పంటను పరిశీలించి ఎరువులు తగు మోతాదు వరకే వాడుకోవాలని సూచిం చారు. పొలంలో నీరు ఎక్కువ నిలవకుండా చూసుకోవాలన్నారు. విఎఎ భార్గవి, రైతులు పాల్గొన్నారు.

లింగాల : వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకొచ్చేందుకు భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎఒ రమేష్ తెలిపారు. మండలంలోని అక్కులగారిపల్లె, ఇప్పట్ల గ్రామాల్లో బుధవారం నిర్వహించిన రైతు గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. రైతు గుర్తింపు సంఖ్య వల్ల ప్రభుత్వ పథకాలు, రాయితీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పెద్ద కుడాల, ఇప్పట్ల రైతు సేవ కేంద్ర సిబ్బంది మౌనిక, హరిశిల్ప, రైతులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ప్రతి రైతు ఒక ప్రత్యేకమైన విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎఒ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కన్నెలూరు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం ఉన్న ప్రతి రైతు ఒక ప్రత్యేకమైన విశిష్ట గుర్తింపు సంఖ్యను రిజిస్ట్రేషన్ ద్వారా పొందాలన్నారు. 11 అంకెలు గల ఈసంఖ్య భూమిగల ప్రతి రైతుకు కేటాయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చక్రాయపేట : ప్రతి పౌరుడికి ఆధార్ నంబర్ కేటాయించిన విధంగా కేంద్రం ప్రభుత్వం ప్రతి రైతుకు ఒక గుర్తింపు ఇవ్వాలని ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించిందని ఎంఎఒ నవంత్ బాబు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో రైతు నమోదు ప్రక్రియ ప్రారం భించామన్నారు.

కల్తీ ఆహారం విక్రయిస్తే చర్యలు

వేంపల్లె : కల్తీ ఆహారాన్ని విక్రయిస్తే అలాంటి దుకాణా దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్‌సేఫ్టీ అధికారి హరిత హెచ్చరించారు. బుధవారం వేంపల్లెలో కూల్‌డ్రింక్ షాపులు, జ్యూస్ షాపులు, హోటళ్లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో కల్తీలేని జ్యూస్ అమ్మాలని ఆదేశించారు. ఆహర భద్రత చట్టం 2005 నిబంధనలను లోబడి వ్యాపారం చేయాలన్నారు. హోటల్ యాజమానులు, జ్యూస్ దుకాణాదారులు లైసెన్సులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు కానిస్టేబుల్ నజీర్, ఫుడ్‌సేఫ్టీ సిబ్బంది పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్సీ రవి సమక్షంలో టిడిపిలో చేరిన కౌన్సిలర్ రంగనాయకులు

స్వచ్ఛందంగా టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కూటమి ప్రభుత్వం ఇచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన చూసి వైసిపి వారు స్వచ్ఛందంగా పులివెందులలో టిడిపిలో చేరుతున్నారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం 13వ వార్డు కౌన్సిలర్ రంగనాయకులు రవి సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మంగళవారం 30వ వార్డు కౌన్సిలర్ షహిదా టిడిపిలో చేరారని తెలిపారు. పులివెందులలో వైసిపి నుంచి వలసలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు సిద్ధారెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాదరెడ్డి, సీనియర్ నాయకులు నల్లగారి భాస్కర్‌రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు మాబాషా, సిద్దయ్య, నాయకులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా సత్యనారాయణ

ప్రజాశక్తి - ఖాజీపేట



రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా ఖాజీపేట పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు సుంకు సత్యనారాయణ శ్రేష్టి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రేషన్ డీలర్లు అందరూ సుంకు సత్యనారాయణ శ్రేష్టిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి చొరవ, కార్డుదారులకు సక్రమంగా రేషన్ పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటానన్నారు. చౌక దుకాణాల ద్వారా ప్రభుత్వం నాణ్యమైన నిత్యవసర వస్తువులను అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వం త్వరలోనే కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయనుందన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ శ్రేష్టి ధన్యవాదాలు తెలిపారు.



ఎస్‌విడిసి విద్యార్థులకు యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు వైవియు డిగ్రీ ఫలితాల్లో చక్కని ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ హరి నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మహ్మద్ ముస్తాఫా, వైస్ ప్రిన్సిపల్ శారద, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మౌనయ్య, అజ్రా అజమత్, నరేష్ విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల విజయకేతనం

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సెమిస్టర్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎసిఆర్ దివాకరరెడ్డి తెలిపారు. స్థానిక కళాశాలలో బుధవారం ఆయన మాట్లాడుతూ యోగివేమన యూనివర్సిటీ విడుదల చేసిన పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో మంచి ర్యాంకులు సాధించారన్నారు. మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో పి.లక్ష్మీదేవి 10 జిపిఎ, బి.రాజకులాయమ్మ 9.50 జిపిఎ సాధించి యూనివర్సిటీ స్థాయిలో మొదటి, రెండవ స్థానంలో నిలిచారన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ఏకైక కళాశాల జమ్మల మడుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అన్నారు. మంచి ఫలితాలను సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్వీ సంజీవరెడ్డి, ఆర్థిక శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఎం సుధీర్ రెడ్డి, రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సి.రమణారెడ్డి, ఆంగ్ల అధ్యాపకుడు నాగేంద్ర, కామర్స్ అధ్యాపకుడు శివరామకృష్ణ, గణిత శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఎ.వెంకటేశ్వర్లు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

విద్యుత్ కార్మికులకు అండగా ఉంటాం

సింహాద్రిపురం : విద్యుత్ కార్మికులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉం టుందని మాజీ జెడ్పిటిసి పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సింహాద్రిపురంలో తెలుగునాడు విద్యుత్ యూనియన్ కార్మికులు బుధవారం డైరీ, క్యాలెండర్లను ఆయనకు అందజేశారు. తెలుగునాడు విద్యుత్ యూనియన్ పులివెందుల డివిజన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిరెడ్డి, సెక్రటరీ దామోదర, యూనియన్ నాయకులు జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి పేద రోగికి ఎంఆర్ఐ, సిటీస్కాన్ చేయాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ఇర్ఫాన్‌బాషా

అవసరమైన ప్రతి పేద రోగికి ఎంఆర్ఐ, సిటీస్కాన్ చేయాలని కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాషా కోరారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని రోగులతో బుధవారం ఆయన మాట్లాడారు. ఎంఆర్ఐ, సిటీస్కాన్ గదులను పరిశీలించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ ఎంఆర్ఐ, సిటీ స్కాన్‌పై ఆంక్షలు విధించడం సబబు కాదన్నారు. ఎముకల డాక్టర్ మాత్రమే స్కానింగులకు రెఫర్ చేయడం సరికాదన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు కూడా రెఫర్ చేసే అధికారమివ్వాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఏ డాక్టర్ అయినా రెఫర్ చేసే అధికారం ఉండాలన్నారు. ప్రొద్దుటూరు, జమ్మల మడుగు, మైదుకూరు, పులివెందుల, కమలాపురం నుండే కాకుండా చాగలమర్రి, ఆళ్లగడ్డ ప్రాంతాల నుండి కూడా వైద్యం కోసం పేద ప్రజలు ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి వస్తుంటారన్నారు. వారం నుండి స్కానింగ్‌లపై ఆంక్షలు పెట్టడంతో అనేక మంది రోగులు ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. గంటల తరబడి వేచి ఉండి చివరికి స్కానింగులు జరక్క వెనుతిరిగే పరిస్థితి ఉందన్నారు. సమస్యను ఇలాగే కొన సాగితే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అవసరమైతే ఉన్నతాధికారులు, ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి కూడా తీసుకెళతామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రి సమస్యలపై సూపరింటెండెంట్‌తో మాట్లాడారు.

ఇమామ్‌లకు గౌరవ వేతనం మంజూరు చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఇమామ్, మౌజన్‌లకు రాష్ట్ర ప్రభుత్వం గౌరవవేతనం మంజూరు చేయాలని ఆవాజ్ కమిటీ కడప జిల్లా అధ్యక్షులు పి.చాంద్‌బాషా కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన వాగ్దానం అమలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మసీదుల్లో ప్రార్థన చేసే ఇమామ్‌లకు రూ.10వేలు, మౌజన్‌లకు రూ.5వేలు గౌరవవేతనం ఇస్తామని ప్రకటించిన విషయం గుర్తు చేశారు. అధికారంలోకొచ్చి 11 నెలలు అవుతున్నా గౌరవవేతనం అందలేదన్నారు. అర్హులైన ఇమామ్, మౌజన్‌లకు ఇంటి స్థలాలు ఇచ్చి, ఇల్లు కట్టించి ఇవ్వాలన్నారు. ముస్లింమైనార్టీలకు ఇచ్చిన వాగ్దానం అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించాలన్నారు. సమావేశంలో ప్రొద్దు టూరు ఆవాజ్ కమిటీ అధ్యక్షులు మహ బూబ్‌బాషా, నాయకులు మహమ్మద్ రసూల్, అబ్దుల్ రహిమాన్ పాల్గొన్నారు.